క్లుప్తంగా

వైద్య శిబిరానికి స్పందన



రోగులను పరీక్షిస్తున్న వైద్యుడు సతీష్

గూడూరు: టీఎస్‌జీ సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలో నిర్వహించిన మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చినట్లు కంటి వైద్య నిపుణులు డాక్టర్ ఆదిమూలపు సతీష్ తెలిపారు. ఆయనతో పాటు అమీలియో ఆసుపత్రి సిబ్బంది శిబిరానికి హాజరై రోగులకు కంటి, బీపీ, షుగర్, గుండె సంబంధిత వ్యాధులకు పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు ఉచితంగా అందించారు.

అలరించిన పౌరాణిక నాటకాలు



భవాని, చింతామణి నాటకంలోని సన్నివేశం

ఓర్వకల్లు: మండలంలోని కాల్వబుగ్గ దేవస్థానంలో సోమవారం రాత్రి నిర్వహించిన ఉచిత పౌరాణిక నాటక ప్రదర్శనలు ప్రేక్షకులను అలరించాయి. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన నాటకాలలో శ్రీకృష్ణ తులాభారం, గయోపాఖ్యానం, భవాని, చింతామణి, సత్య హరిశ్చంద్ర నాటకాలలో కళాకారులు ఆలపించిన పద్యాలు కళాప్రియులను ఆకట్టుకున్నాయి. ప్రేమ్ సాగర్, రత్నశ్రీ కాంబినేషన్‌లో ప్రదర్శించిన భవాని, చింతామణి ప్రేమ ఘట్టం ప్రేక్షకులను అబ్బురపరచింది.

ఫిజియోథెరపీతో వైకల్యం దూరం




ఫిజియోథెరపీని పరిశీలిస్తున్న ఎంఈఓ

కోడుమూరు: క్రమంతప్పకుండా ఫిజియోథెరపీ చేయించుకుంటే వైకల్యం దూరమవుతుందని ఎంఈఓ అనంతయ్య సూచించారు. పట్టణంలోని భవితా కేంద్రాన్ని మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి మంగళవారం దివ్యాంగ పిల్లలు, ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారులకు ఫిజియోథెరపీ చేయించాలని వారి తల్లిదండ్రులకు సూచించారు. కార్యక్రమంలో కొండపేట ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం లక్ష్మన్న, ఐఈఆర్‌టీలు సీతారామయ్య, ఆదినారాయణమ్మ పాల్గొన్నారు.

సర్వేను పూర్తి చేయండి

కల్లూరు: సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సర్వేను సకాలంలో పూర్తి చేయాలని కర్నూలు డివిజన్ గ్రామ/వార్డు సచివాలయాల అభివృద్ధి అధికారి పి.బాలకృష్ణరెడ్డి సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం ఉలిందకొండ గ్రామ 1, 2 సచివాలయాలను తనిఖీ చేశారు. సచివాలయ ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. ఐదేళ్లలోపు పిల్లలకు బాల ఆధార్ నమోదు పూర్తి చేయాలన్నారు. ఆయుష్మాన్ భారత్ సర్వేను పూర్తి చేసి ప్రతి కుటుంబానికి ఇన్సూరెన్స్ కార్డు అందించాలన్నారు. గ్రామాల్లో రక్త హీనతతో ఉన్న పిల్లలను గుర్తించి పౌష్టికాహారం అందించేలా చూడాలన్నారు. ప్రతి రోజు మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు స్పందన కార్యక్రమం నిర్వహించాలన్నారు. వైఎస్సార్ కల్యాణమస్తు, షాదీ తోఫా పథకాల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. గ్రామాల్లో బాల్య వివాహాలు జరగకుండా సచివాలయ మహిళ పోలీసులు నిఘా ఉంచి ఉన్నతాధికారులకు సమాచారం అందించాలన్నారు.

ఇంటి పన్ను వసూలు చేయండి



వివరాలు తెలుసుకుంటున్న డీఎల్‌పీఓ తిమ్మక్క

కల్లూరు: గ్రామ పంచాయతీల నుంచి వంద శాతం ఇంటి పన్ను వసూలు చేయాలని డీఎల్‌పీఓ తిమ్మక్క పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. మంగళవారం పెద్దటేకూరు సచివాలయాన్ని తనిఖీ చేసి రికార్డులను, రిజిస్టర్లను పరిశీలించారు. గ్రామంలో ఎన్ని అసెస్‌మెంట్లు ఉన్నాయని, ఇంత వరకు ఎంత శాతం పన్ను వసూలు చేశారని పంచాయతీ కార్యదర్శిని అడిగి తెలుసుకున్నారు. సచివాలయానికి వచ్చే ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. అనంతరం తడకనపల్లె గ్రామంలో ఎస్‌డబ్ల్యూపీసీ(చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం)ను పరిశీలించారు. కేంద్రం నుంచి వర్మీకంపోస్టు ఎరువును తయారు చేయాలన్నారు. ఆమె వెంట ఈఓఆర్డీ రవికిశోర్ ఉన్నారు.

నేటి నుంచి ఓర్వకల్లులో ఉరుసు

ఓర్వకల్లు: మండల కేంద్రమైన ఓర్వకల్లులో బుధవారం నుంచి హజరత్ సయ్యద్ సుల్తాన్ మహమూద్‌షా ఖాద్రి ఉరుసు నిర్వహించనున్నట్లు దర్గా నిర్వాహకులు తెలిపారు. బుధవారం గంధం, గురువారం ఖవ్వాలి, పాటల కచేరి, శుక్రవారం జియారత్‌తో ఉత్సవాలు ముగుస్తాయన్నారు.

ప్రయాణం రయ్ రయ్!

పల్లెలకు కొన్నేళ్ల క్రితం వరకు సరైన రహదారులు ఉండేవి కావు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు దేవుడిపైనే భారం వేసి ప్రయాణం సాగించేవారు. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. రెండేళ్లుగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.కోట్లు ఖర్చు చేసి నియోజకవర్గంలోని మారుమూల గ్రామాలకు సైతం రోడ్డు సౌకర్యం ఏర్పాటు చేస్తోంది. నాడు నేడు కార్యక్రమంలో ప్రతి గ్రామానికీ బీటీ రోడ్డు వేసింది. ఫలితంగా ప్రయాణం రయ్‌రయ్‌మంటూ సాగుతోంది.

- నాడు–నేడు కార్యక్రమంతో ప్రయాణ కష్టాలకు చెక్
- రెండేళ్లలో ప్రతి గ్రామానికి బీటీ రోడ్డు
- రూ.కోట్లు ఖర్చు చేసిన ప్రభుత్వం





పాణ్యం మండం కందికాయపల్లె-రామతీర్థం గ్రామాల మధ్య వేసిన నూతన బీటీ రోడ్డు

పాణ్యం: ప్రభుత్వం పల్లె రోడ్లకు ప్రాధాన్యతనిస్తోంది. అందులో భాగంగా రెండేళ్లుగా రహదారుల నిర్మాణానికి చర్యలు చేపట్టింది. నియోజకవర్గంలోని 80 శాతం గ్రామాలకు ఇప్పటికే రోడ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. పాణ్యం మండలం మద్దూరు–కొత్తూరు గ్రామాల మధ్య రూ.2 కోట్లు, కొణిదేడు–కొత్తూరు రూ.1.80కోట్లు, తొగర్చేడు–ఉడుమల్పూరం రూ.70 లక్షలు, పాణ్యం–బనగానపల్లెకు రూ.2.35 కోట్లు, గోనవరం–బలపనూరు రూ.2.60 కోట్లు వెచ్చించి రోడ్ల నిర్మాణాలు చేపట్టారు. అలాగే పిన్నాపురం బ్రిడ్జి మరమ్మతులకు రూ.85 లక్షలు ఖర్చు చేశారు. మద్దూరు–కొత్తూరు గ్రామాల మధ్య ఉన్న వాగుపై రూ.85 లక్షలతో కల్వర్టు పూర్తి చేశారు. తక్షణ మరమ్మతుల కింద భూపనపాడు గ్రామ పరిధిలోని సీసీ రోడ్డుకు రూ.20 లక్షలు, మద్దూరు పీహెచ్‌సీ నాడు–నేడు కింద రూ.67.25 లక్షల చొప్పున ఖర్చు చేసి రోడ్లు నిర్మించారు. గడివేముల మండలం మంచాలకట్ట గ్రామానికి రూ.20 లక్షలతో రహదారి ఏర్పాటు చేశారు. రూ.2కోట్లతో బుజునూరుమెట్ట- పెసరవాయి గ్రామాల మధ్య రోడ్డు నిర్మించి ప్రయాణ కష్టాలు తొలగించారు. కె.నాగలాపురం – బస్తీపాడు, చిన్నటేకూరు మీదుగా నన్నూరుకు రూ.1.65కోట్లతో రోడ్డు నిర్మించారు. కల్లూరు అర్బన్ పరిధిలో ఈద్గా నుంచి చెన్నమ్మ సర్కిల్ వరకు రూ.70లక్షలతో రోడ్డుకు మరమ్మతులు చేపట్టారు. నన్నూర్ నుంచి బస్తీపాడు వయా చిన్నటేకూరు మీదుగా ఉన్న సింగిల్ రోడ్డును డబుల్ రోడ్డుగా మార్చేందుకు రూ.22.50 కోట్లతో పనులు ప్రారరంభించనున్నారు. ఓర్వకల్లు మండం కాల్వబుగ్గ జాతీయ రహదారి నుంచి గుడుంబాయి తండాకు రూ.79 లక్షలు, చింతలపల్లెకు రూ.1.20కోట్లు, రామళ్లకోట వరకు రూ.3కోట్లతో బీటీ రోడ్లు నిర్మించారు. కొంతలపాడు ఎస్సీ కాలనీ నుంచి రూ.20లక్షలతో తారు రోడ్డు వేశారు. సోమయాజుల పల్లె రహదారి నుంచి కొమరోలు వరకు రూ.40 లక్షలతో బీటీ రోడ్డు నిర్మించారు. నన్నూరు – మీదివేముల వయా ఉయ్యాలవాడ వరకు రూ.40లక్షలతో రోడ్డుకు మరమ్మతులు చేపట్టారు. గార్గేయపురం నుంచి కేతవరం వరకు సుమారు 40 లక్షలతో బీటీ నిర్మించారు. ఓర్వకల్లు నుంచి మిడుతూరుకు వెళ్తే దారిలో రూ.80లక్షలతో సీసీ రోడ్డు ఏర్పాటు చేసి ప్రయాణం సులభతరం చేశారు.

ఇబ్బందులు తొలగాయి



రామతీర్థం–కందికాయపల్లె గ్రామాల మధ్య సరైన రోడ్డు లేక తీవ్ర ఇబ్బందులు పడేవాళ్లం. గతంలో అనేకసార్లు అధికారులకు అర్జీలు ఇచ్చినా ఫలితం లేకపోయింది. ఇదే విషయాన్ని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా రూ.50లక్షలు మంజూరు చేయించి రోడ్డు ఏర్పాటు చేయించడంతో ప్రయాణ ఇబ్బందులు తొలిగిపోయాయి. – రామచంద్రుడు, సర్పంచ్, కందికాయపల్లె, పాణ్యం మండలం

రూ.2 కోట్లతో రోడ్డు నిర్మించారు



బూజనూరు మెట్ట నుంచి మా గ్రామానికి సరైన రహదారి ఉండేది కాదు. గుంతలమయంగా ఉన్న రోడ్డుపై రాకపోకలు సాగించాలంటే వాహనదారులకు, ప్రయాణికులకు నరకం కనిపించేది. ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి రూ.2 కోట్లు మంజూరు చేయించి బీటీ రోడ్డు వేయించడంతో కష్టాలు తప్పిపోయాయి. ఆయనకు కృతజ్ఞతలు. – కురువ విశ్వనాథం, పెసరవాయి, గడివేముల మండలం

పనులు ప్రారంభిస్తాం

ప్రతి గ్రామానికి రోడ్డు వేయాలన్నది ప్రభుత్వ లక్ష్యం. అందుకు తగ్గట్టు నాడు–నేడు కార్యక్రమంలో భాగంగా బీటీ, కల్వర్టులు, సీసీ రోడ్లు నిర్మిస్తున్నాం. ఆయా గ్రామ ప్రజాప్రతినిధుల తీర్మానాలకు అంచనాలు వేసి ప్రతిపాదనలు పంపుతున్నాం. ఉన్నతాధికారుల ఆదేశాలతో పనులు ప్రారంభిస్తున్నాం. వచ్చే వర్షాకాలం నాటికి దాదాపు అన్ని గ్రామాలకు రహదారులు నిర్మించేందుకు కృషి చేస్తాం. – వెంకటేశ్వరరెడ్డి, ఆర్అండ్‌బీ ఏఈ

నేడు హుండీ కానుకల లెక్కింపు

గూడూరు రూరల్: మండల పరిధిలోని కె.నాగలాపురం శ్రీ సుంకులాపరమేశ్వరీదేవి ఆలయం హుండీల కానుకలను బుధవారం లెక్కించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి దినేష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అమ్మవారికి భక్తులు సమర్పించిన కానుకలను గ్రామ పెద్దలు, పోలీసుల సమక్షంలో లెక్కించనున్నట్లు తెలిపారు.

ఘనంగా మాతృభాష దినోత్సవం

కర్నూలు (న్యూటౌన్): మండల పరిధిలోని మిలిటరీ కాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం ఎస్ విజయమ్మ మాట్లాడుతూ తెలుగు భాషను పరిరక్షించుకోవడం మనందరి బాధ్యత అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాఘవయ్య, అనురాధ పాల్గొన్నారు.

రేపు మాన్యం భూముల కౌలు వేలం

గూడూరు రూరల్: మండల పరిధిలోని చనుగొండ్ల నాగలింగేశ్వర, కేశవ స్వామి ఆలయాల మాన్యం భూముల వేలంపాటలు ఈ నెల 23న నిర్వహించనున్నట్లు ఆలయ వర్క్‌ఇన్‌స్పెక్టర్ మురళి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 81, 93, 262 సర్వే నంబర్లలోని ఆలయ భూములను మూడేళ్ల కౌలుకు ఇచ్చేందుకు దేవదాయ శాఖ నిర్ణయం తీసుకుందన్నారు. ఆసక్తి ఉన్న వారు రూ.5,000 చెల్లించి కౌలు వేలం పాటలో పాల్గొనాలన్నారు.

భక్తిశ్రద్ధలతో భోగేశ్వరుడి వసంతోత్సవం

గడివేముల: శ్రీ దుర్గాభోగేశ్వరుడి ఆలయంలో నాలుగు రోజుల నుంచి జరుగుతున్న మహాశివరాత్రి ఉత్సవాలు మంగళవారం వసంతోత్సవంతో ముగిశాయి. ప్రధాన అర్చకులు శ్యాంసుందర్‌శర్మ ఆధ్వర్యంలో స్వామివారికి ఉదయం తిరుమంజనము, నాకబలి, వసంతోత్సవం, ధూపదీప నైవేద్యాలు తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కోనేరులో అవబృంతస్నానం నిర్వహించారు. ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి సాయంత్రం గడిగరేవుల గ్రామంలో గ్రామోత్సవం, పారువేట నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ఐసాని సునీల్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.



భోగేశ్వరుడికి కోనేరులో వసంతోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

కోలుకోలేక గొర్రెల కాపరి మృతి

పాణ్యం: పాము కాటుకు గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గొర్రెల కాపరి కోలుకోలేక మృతిచెందాడు. ఎస్‌ఐ సుధాకర్ తెలిపిన వివరాలు.. బేతంచెర్ల మడలం సిమెంట్ నగర్‌కు చెందిన సురేంద్ర(23) గొర్రెల పెంపకంతో జీవనం సాగించేవాడు. ఈనెల 19న గొర్రెలు మేపేందుకు పాణ్యం మండలం కందికాయపల్లె కొండల్లోకి వెళ్లాడు. అక్కడ పాము కాటుకు గురయ్యాడు. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా కోలుకోలేక మృతి చెందాడు.

భీరం బుల్స్ భళా

ఓర్వకల్లు: మండలంలోని కాల్వబుగ్గ దేవస్థానం వద్ద నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఎద్దులు బండలాగుడు పోటీల్లో పాణ్యం మండలం ఎస్ కొత్తూరు గ్రామానికి చెందిన భీరం సుబ్రహమణ్యేశ్వరరెడ్డి వృషభాలు విజేతగా నిలిచాయి. పోటీలను మంగళవారం పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ప్రారంభించారు. హోరాహోరీగా సాగిన బండలాగుడు పోటీలలో నాగర్‌కర్నూలు జిల్లా రాయవరం రామచంద్రారెడ్డి వృషభాలు ద్వితీయ, పాణ్యం మండలం కొత్తూరుకు చెందిన భీరం బుల్స్ తృతీయ స్థానాలను కైవసం చేసుకున్నాయి. నాలుగవ స్థానంలో వైఎస్సార్ జిల్లా ఖదర్‌కొట్టాలకు చెందిన భావనశ్రీ వృషభాలు, ఐదవ స్థానంలో అనంతపురం జిల్లా చెలంకూరు సుదర్శన్ వృషభాలు, ఆరవ స్థానంలో ప్యాపిలి మండలం రంగాపురం గ్రామానికి చెందిన జూటూరు రామచంద్రారెడ్డి వృషభాలు నిలిచాయి. విజేత ఎడ్ల యజమానులకు వరుసగా రూ.లక్ష, రూ.80 వేలు, రూ.60 వేలు, రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.20 వేల చొప్పున నగదు బహుమతులను ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అందజేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ గుర్రాల చెన్నారెడ్డి, సింగిల్ విండో చైర్మన్ నాగతిరుపాలు, రైతు సంఘం నాయకులు గోపా రమణారెడ్డి, రామేశ్వరరెడ్డి, జికే వెంగన్న, గోపా మోహన్‌రెడ్డి, లోటర్ బాషా, గంధం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

నేడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వర్ధంతి

కర్నూలు కల్చరల్: స్థానిక ఏక్యాంప్‌లోని ఉయ్యాలవాడ నరసింహారెడ్డి సర్కిల్‌లో బుధవారం ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వర్ధంతిని నిర్వహించనున్నట్లు సేవా సమితి అధ్యక్షులు విజయమోహన్‌రెడ్డి మంగళవారం తెలిపారు.

భక్తిశ్రద్ధలతో విష్వక్సేన ఇష్టి





విగ్రహ ప్రతిష్టలో పండితులు,పూజల్లో త్రిదండి అష్టాక్షరీ సంపత్కుమార రామానుజ జీయర్ స్వామి, రుత్వికులు

కర్నూలు కల్చరల్: నగర శివారులోని మామిదాలపాడు సమీపంలోని గోదా గోకులంలో మార్చి 1న నిర్వహించనున్న శ్రీరంగనాయకి గోదా సమేత శ్రీరంగనాథ పెరుమాళ్, సుదర్శన, గరుడ, ఆల్వారాచార్యుల దేవతామూర్తుల ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని పురస్కరించుకుని మంగళవారం విష్వక్సేన ఇష్టి కార్యక్రమాన్ని నిర్వహించారు. యాగశాల ద్వారతోరణ ధ్వజ, కుంభారాధన, బాలభోగ నివేదన, విష్ణు సహస్రనామ పారాయణం తదితర కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అష్టాక్షరీ సంపత్కుమార రామానుజ జీయర్ స్వామి అనుగ్రహ భాషణం చేశారు. తిరుమల తిరుపతి దేవస్థానములు, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో కళాకారులు పద్మశ్రీ, రమణ, బాలస్వామిల సంకీర్తనల ఆలాపన అలరించాయి. వేద పండితుల ఆధ్వర్యంలో జరుగుతున్న విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. గోదాగోకులం వ్యవస్థాపకులు మారం నాగరాజు గుప్త, మేనేజింగ్ ట్రస్టీ పల్లెర్ల నాగరాజు, సభ్యులు పాలాది సుబ్రహ్మణ్యం, ఇల్లూరి రామయ్య, బాలసుధాకర్, చిత్రాల వీరయ్య, భూమా కృష్ణ మోహన్, వేముల జనార్దన్, రవి ప్రకాష్, తిరుమల తిరుపతి దేవస్థానములు, హిందూ ధర్మ ప్రచార పరిషత్ మల్లు వెంకటరెడ్డి, గోకులం పరివారం పాల్గొన్నారు.



ముస్తాబైన గోదా గోకులం



విష్వక్సేన ఇష్టి హోమాల్లో భక్తులు

జేసీ రాంసుందర్‌రెడ్డికి మాతృవియోగం

- రోడ్డు ప్రమాదంలో మృతి.. నివాళులర్పించిన ఎమ్మెల్యే, కలెక్టర్

చాపాడు: కర్నూలు జిల్లా జాయింట్ కలెక్టర్ శెట్టిపల్లె రాంసుందర్‌రెడ్డి తల్లి శెట్టిపల్లె కాంతమ్మ(73) సోమవారం రాత్రి మృతి చెందారు. చాపాడు మండలం నక్కలదిన్నెలో నివాసం ఉంటున్న కాంతమ్మ సోమవారం మధ్యాహ్నం బైక్‌పై నుంచి దిగే క్రమంలో ప్రమాదవశాత్తూ కింద పడ్డారు. తలకు తీవ్ర గాయం కావడంతో ప్రొద్దుటూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స చేయించగా అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందారు. ఈ క్రమంలో మంగళవారం స్వగ్రామమైన నక్కలదిన్నెలో కాంతమ్మ మృతదేహం వద్ద సమీప బంధువు మైదుకూరు ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి, సతీమణి ప్రభావతమ్మ, కర్నూలు జిల్లా కలెక్టర్ కోటేశ్వరావు, డీఐజీ సింథిల్ కుమార్, మున్సిపల్ కమిషనర్ భార్గవ తేజ తదితరులు ఘనంగా నివాళులర్పించారు.



కాంతమ్మ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి దంపతులు, పక్కనే జేసీ రాంసుందర్‌రెడ్డి

తెరుచుకోని నిడ్జూరు జెడ్పీ పాఠశాల

కర్నూలు (న్యూటౌన్): మండల పరిధిలోని నిడ్జూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తలుపులు మంగళవారం తెరవకపోవడంతో విద్యార్థులు మధ్యాహ్నం వరకు వేచి చూసి ఇళ్లకు వెళ్లిపోయారు. పాఠశాలలో 100కు పైగా విద్యార్థులు, 8మంది ఉపాధ్యాయులు ఉన్నారు. హెచ్‌ఎం కొంతకాలం క్రితం జిల్లా కేంద్రంలోని సర్వశిక్ష అభియాన్ కమ్యూనిటీ మొబిలైజేషన్ ఆఫీసర్‌గా డిప్యూటేషన్‌పై వెళ్లగా.. మరో ఉపాధ్యాయుడు జావిద్‌బాషా ఇన్‌చార్జ్ హెచ్‌ఎంగా కొనసాగుతున్నారు. కాగా మంగళవారం పాఠశాల తలుపులు తెరవకపోవడంతో విద్యార్థులు ఆరుబయట చెట్ల కింద వేచి చూసి మధ్యాహ్నం 12.30 గంటల తర్వాత ఇళ్లకు వెళ్లిపోయారు. ఈ విషయాన్ని గ్రామస్తుల ద్వారా తెలుసుకున్న కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ పాఠశాల వద్దకు చేరుకుని పరిశీలించారు. అనంతరం జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వరరావు, డీఈఓ రంగారెడ్డికి ఎమ్మెల్యే ఫోన్ చేసి ఫిర్యాదు చేశారు.



తాళం వేసిన పాఠశాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

వ్యాధినిర్ధారణకు రోగులను బయటకు పంపొద్దు

కర్నూలు(హాస్పిటల్): వ్యాధినిర్ధారణ పరీక్షల కోసం రోగులను బయటి ల్యాబ్‌లకు పంపితే సంబంధిత వైద్యులు, పీజీలు, నర్సులపై చర్యలు తీసుకుంటామని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ జి.నరేంద్రనాథ్‌రెడ్డి హెచ్చరించారు. మంగళవారం ఆయన ఆసుపత్రిలోని పలు విభాగాలను తనిఖీ చేశారు. చిన్నపిల్లల విభాగం, గైనిక్, డైట్, ఆసుపత్రి ఆవరణలో ఉన్న ఆక్సిజన్ ప్లాంట్‌లను పరిశీలించారు. ఎంఆర్‌ఐ స్కానింగ్ సెంటర్, ఇతర విభాగాల్లో రికార్డులు తనిఖీ చేశారు. చిన్నపిల్లలు, గైనిక్ విభాగాల్లో అందుతున్న వైద్యసేవల గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. రోగులతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించాలని సూచించారు. ఏబీజీ టెస్టింగ్ మిషన్‌ను 24 గంటల పాటు ఏఎంసీలో అందుబాటులో ఉంచాలన్నారు. స్కానింగ్ రిజిస్టర్‌ను పరిశీలించి, వీలైనంత త్వరగా రోగులకు రిపోర్ట్‌లు ఇవ్వాలని సూచించారు. ఆయన వెంట సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ బి.వెంకటేశ్వరావు, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ శివబాలనాగాంజన్ ఉన్నారు.



సిబ్బందితో మాట్లాడుతున్న డాక్టర్ నరేంద్రనాథ్‌రెడ్డి

నలుగురికి ఏఐసీసీలో చోటు

కర్నూలు(సెంట్రల్) : ఉమ్మడి కర్నూలు జిల్లా నుంచి ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ(ఏఐసీసీ) సభ్యులుగా నలుగురికి స్థానం లభించింది. కర్నూలు, నంద్యాల డీసీసీ అధ్యక్షులుగా ఉన్న ఎం.సుధాకరబాబు, లక్ష్మీనరసింహయాదవ్, పాణ్యం నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా ఉన్న నాగమధుయాదవ్, నందికొట్కూరుకు చెందిన అశోకరత్నం ఎంపికయ్యారు. ప్రతి పార్లమెంట్ నియోజకవర్గానికి ఇద్దరు చొప్పున ఏఐసీసీలోకి తీసుకున్నట్లు ఆ పార్టీ నాయకులు తెలిపారు.

'ఫ్యామిలీ ఫిజీషియన్'ను పర్యవేక్షించాలి

కర్నూలు(హాస్పిటల్): ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని పర్యవేక్షించాలని కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ నివాస్ అధికారులకు సూచించారు. మంగళవారం ఆయన మంగళగిరి నుంచి జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారులతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫేషియల్ రికగ్నేషన్ సిస్టమ్ ద్వారానే ప్రతి ఒక్కరూ హాజరు వేయాలన్నారు. ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమానికి కేటాయించిన వైద్యులు, ఆరోగ్య సిబ్బంది గ్రామాలను సందర్శించి రెండు పూటలా వైద్యసేవలు అందించాలన్నారు. వైద్యాధికారులు వారి పరిధిలోని హాస్టళ్లను సందర్శించి విద్యార్థులకు తగిన ఆరోగ్యసేవలు అందించాలన్నారు. గర్భిణులు, కిశోరబాలికలకు హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించి రక్తహీనత ఉన్న వారికి తగిన చికిత్సలు అందించి, వివరాలను అనీమియా మానిటరింగ్ టూల్‌లో నమోదు చేయాలన్నారు. అసంక్రమిత వ్యాధుల సర్వే వీలైనంత త్వరగా పూర్తి చేసి, వైద్యం అందించాలన్నారు. సమావేశంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.రామగిడ్డయ్య, జిల్లా వ్యాధినిరోధక టీకాల అధికారి డాక్టర్ వై.ప్రవీణ్‌కుమార్, జిల్లా క్షయ నియంత్రణాధికారి డాక్టర్ భాస్కర్, డీపీఎంఓ డాక్టర్ ఉమా, ఆర్‌బీఎస్‌కే జిల్లా కో ఆర్డినేటర్ హేమలత, మలేరియా అధికారి నూకరాజు, డీపీహెచ్‌ఎన్‌ఓ లిన్నెట్ లిడియా, ఎస్‌ఓ హేమసుందర్, డెమో శ్రీనివాసులు, డిప్యూటీ డెమో చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.



జూమ్ కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అధికారులు

పరిష్కారాలతో అర్జీదారులను సంతృప్తి పరచండి

- కలెక్టర్ పి.కోటేశ్వరరావు

కర్నూలు(సెంట్రల్): స్పందనలో ఇచ్చిన అర్జీలకు పరిష్కారాలు చూపి అర్జీదారులను సంతృప్తి పరచాలని కలెక్టర్ పి.కోటేశ్వరరావు మండల స్థాయి అధికారులకు సూచించారు. మంగళవారం ఆయన కలెక్టరేట్ నుంచి వివిధ సంక్షేమ, అభివృద్ధి పథకాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్జీదారులు పదేపదే స్పందన కార్యక్రమానికి రాకుండా సమస్యలను ఎప్పటికప్పుడే పరిష్కరించాలన్నారు. సచివాలయ ఉద్యోగుల హాజరుపై ఎంపీడీఓలు, మునిసిపల్ కమిషనర్లు దృష్టిసారించాలన్నారు. సచివాయాల్లో సేవలను విస్తృతం చేసుకోవాలని ఉద్యోగులకు సూచించారు. కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల దరఖాస్తులను శనివారంలోపు ఆమోదం తెలపాలని పత్తికొండ, కర్నూలు ఆర్‌డీఓలకు సూచించారు. ఎంపీడీఓల లాగిన్‌లో ఉన్న కల్యాణమస్తు–షాదీతోఫా దరఖాస్తులపై త్వరగా విచారణ జరపాలన్నారు. సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనలో భాగంగా రక్తహీనతతో బాధపడుతున్న వారికి ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలను ఆరోగ్య కార్యకర్తల ద్వారా అందించాలన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి సంబంధించి పనులు పూర్తయితే బిల్లులు పోర్టల్ అప్‌లోడ్ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. హౌసింగ్‌కు సంబంధించి రూఫ్ కాంక్రీట్ లెవెల్‌లో ఉన్న ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయించాలన్నారు. నిర్మాణంలో ఉన్న ఇళ్లను పూర్తి చేసేందుకు సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, హౌసింగ్ సిబ్బంది ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. హౌసింగ్‌లో ప్రతీరోజూ పురోగతి వచ్చేలా చూడాలన్నారు. స్పందనకు సంబంధించిన 1902 కాల్ సెంటర్, ఇతర మాధ్యమాల ద్వారా వచ్చిన అర్జీలు మరోసారి రాకుండా పరిష్కరించాలన్నారు. సమావేశంలో జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి, సీపీఓ అప్పలకొండ, పీఆర్ ఎస్ఈ సుబ్రమణ్యం, డీపీఓ నాగరాజునాయుడు, హౌసింగ్ పీడీ వెంకటనారాయణ పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడుతున్న కలెక్టర్ పి.కోటేశ్వరరావు